జాబ్‌మేళాలో 29 మంది ఎంపిక

స్కిల్ హబ్ సెంటర్లో నిర్వహిస్తున్న జాబ్ మేళా

ప్రజాశక్తి - ముమ్మిడివరం

స్థానిక ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల్లో సోమవారం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యాలయంలో నిర్వహించిన జాబ్ మేళాలో 29 మంది ఎంపికైనట్లు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరిశేషు తెలిపారు. ఈ జాబ్ మేళాకు 71 మంది హాజరు కాగా వీరిలో 29 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్బంగా హరి శేషు మాట్లాడుతూ ఎంపికైన వారికి స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ఇచ్చే శిక్షణ నిరుద్యోగ యువతకు ఉపయోగపడుతుందన్నారు. ఈ మేళాలో ముమ్మిడివరం స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ శ్రీదేవి, డిపిఒ రాజేంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చైతన్యాన్ని నింపిన సదస్సులు

- ఆకట్టుకున్న ప్రముఖుల ప్రసంగాలు
- కాకినాడలో భారీ ప్రదర్శన
- ఉత్సాంగా పాల్గొన్న ఉపాధ్యాయులు
- 2వ రోజుకు స్వర్ణోత్సవ మహాసభ

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలో భాగంగా సోమవారం నిర్వహించిన విద్యాసదస్సు, సాహిత్య సదస్సు, మహిళా సదస్సు చైతన్యాన్ని నింపాయి. ప్రముఖుల ప్రసంగాలు ఆలోచింపజేశాయి. విద్యా వ్యవస్థలో వస్తున్న పోకడలు, సాహిత్యం ఆవశ్యకత, మహిళలపై కొనసాగుతున్న వివక్ష వంటి వాటిపై సదస్సుల్లో వ్యక్తలు ప్రస్తావించారు. వారి ప్రసంగాలను ఆసక్తిగా విన్నారు. సాయంత్రం కాకినాడ నగరంలో నిర్వహించిన భారీ ర్యాలీతో స్మార్ట్ సిటీ ఎరుపు రంగును పులుముకుంది.

:: ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, పిఠాపురం ::

హాజరైన ప్రతినిదులు

ఆర్ఎస్ఎస్ నియంత్రణలో ఎన్ఇపి

కేరళ విద్యా శాఖ మాజీ మంత్రి బేబి

కేంద్రంలోని మోడీ సర్కార్ తీసుకొచ్చిన నూత విద్యా విధానం ఆర్ఎస్ఎస్ నియంత్రణలో, బిజెపి ఆధిపత్యంతో ఉందని కేరళ విద్యా శాఖ మాజీ మంత్రి ఎంఎ.బేబి అన్నారు. యుటిఎఫ్ సర్ణోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యా సదస్సు యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.సురేష్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో బేబి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని చిన్నాభిన్నం చేస్తుందన్నారు. ఎన్ఇపికి ప్రత్యామ్నాయంగా కేరళ ప్రజాస్వామిక విద్యా విధానం అమలవుతుందన్నారు. 1956లో కేరళలో నంబూద్రిపాద్ నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విద్యా విధానంతో బిల్లును తీసుకొచ్చిందన్నారు. 1957లో విద్యా రంగంతో సంబంధం ఉన్న భూ సంస్కరణలు తీసుకొచ్చిందని తెలిపారు. భూమి లేని వ్యవసాయ కార్మికులు, రైతులకు భూములు ఇవ్వడంతో, వారి ఆర్థిక సామర్థ్యం పెరిగి, తమ పిల్లలను చదువించుకోగలమనే నమ్మకం వచ్చిందని తెలిపారు. ఇవన్నీ ప్రజాస్వామ్య విద్యా విధానం ఉద్భవించడానికి ఉపయోగపడ్డాయని అన్నారు. ఇంగ్లీష్ మీడియం విద్యా చాలా గొప్పదనే భావన పోవాలన్నారు. ప్రపంచంలో చాలా మంది ప్రముఖులు తమ మాతృ భాషలోనే విద్యాభ్యాసం చేశారని గుర్తు చేశారు.

యుటిఎఫ్ సీనియర్ నాయకులు వితపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రాథమిక విద్యపై పూర్తిస్థాయిలో దష్టిని పెట్టి ప్రణాళికలు రచించి అందుకు తగ్గట్టుగా కేటాయింపులు చేయాలన్నారు. ఒక దార్శనికత, ఒక స్పష్టత లేని విద్యా విధానం ఇక్కడ కొనసాగుతుందని విమర్శించారు. నేటి పాలకులు విద్యారంగానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. జయతి ఘోష్ కమిటీ గురించి ప్రస్తావిచారు. ఆంధ్రప్రదేశ్‌కు సొంతంగా ఒక విద్యా విధానం, అకాడమిక్ విధానం, పరీక్ష విధానం ఉండాలన్నారు. పాఠశాల విద్యలో మనం 11వ స్థానంలో వెనకబడి ఉన్నామని గుర్తు చేశారు. ఎస్‌టిఎఫ్ఐ జాతీయ కార్యదర్శి సిఎన్.భారతి మాట్లాడుతూ దేశంలో విద్య పూర్తిగా వ్యాపారం అయిపోయిందన్నారు. ఉపాధ్యాయుల హక్కులు ఆయా ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. ప్రభుత్వాలు సిపిఎస్ ను వెంటనే రద్దుచేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. ఉపాధ్యాయుడు సామాజికంగానూ, ఆర్థికంగానూ ఉన్నతంగా ఉన్నప్పుడే మంచి బోధన చేయగలడన్నారు. ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివారెడ్డి, విద్యాసాగర్ మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు వల్ల చైతన్యం పెరుగుతుందన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రంలో అనేక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయన్నారు. జిఒ 117ను రద్దు చేయాలన్నారు. 3, 4, 5 ప్రాథమిక పాఠశాలల్లోనే ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎఫ్ ఎంఎల్‌సిలు కెఎస్.లక్ష్మణరావు, ఇళ్ల వెంకటేశ్వరరావు, బొర్రా గోపిమూర్తి, యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శులు రెడ్డి మోహన్రావు, కిషోర్, మనోహర్, లక్ష్మీ రాజ్యం, జ్యోతి బసు, అన్నారాం, కుమార్ రాజా, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ గీతాలు ఆలపిస్తున్న యుటిఎఫ్ ఉపాధ్యాయులు

పుస్తకావిష్కరణలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి లక్ష్మణరావు

పాఠ్యపుస్తకాలకు మతం రంగు తగదు

సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్

తరగతి గదుల్లో బోధించే పాఠ్యపుస్తకాలకు మతం రంగు పులమడం సరికాదని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కె.మోహన్ అన్నారు. ఐక్యోపాధ్యాయ ప్రధాన సంపాదకులు ఎన్.కుమారరాజా అధ్యక్షతన జరిగిన సాహిత్య సదస్సులో ఆయన మాట్లాడారు. సామ్రాజ్యవాద విష కౌగిట్లో దేశం ఉందన్నారు. దాని నుంచి బయట పడేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. లౌకిక తత్వాన్ని కాపాడాలన్నారు. శాస్త్రీయమైన విద్యను అందించేందుకు కృషి చేయాలన్నారు. తరగతి గదిలో ప్రశ్నించే తత్వాన్ని పెంచడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. కలంతో యుద్ధం చేస్తే తప్ప ఈ అసమానతలు, విష సంస్కృతిపై విజయం సాధించలేమన్నారు.

కుమార రాజా మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజాభివృద్ధికి సాహిత్యం అవసరమన్నారు. సాహిత్యానికి చరిత్రలో ఎనలేని ప్రాముఖ్యత ఉందన్నారు. 1905 బెంగాల్ విభజనలో విద్యార్థులను ఐకమత్యం చేసే దానికి సాహిత్యం బాగా ఉపయోగపడిందన్నారు. వేమన పద్యాలు సమాజంలో ఐక్యతా విలువలను, ఆధునిక భావనలు పెంచడంలో కీలక భూమిక పోషిస్తున్నాయన్నారు. శ్రీశ్రీ, గురజాడ వంటి కవుల రచనలు స్ఫూర్తిదాయకమన్నారు. రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ సాహిత్యం మరో నవ సమాజాన్ని నిర్మించడానికి తోడ్పడుతుందన్నారు. ఈ సదస్సులో అట్టాడ అప్పలనాయుడు రచించిన నక్షత్ర బాట పుస్తకాన్ని, కె.మోహన్ రచించిన 'చెమట చెక్కిన వాక్యం' పుస్తకాలను ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యదర్శి నవ కోటేశ్వరరావు వందన సమర్పణ చేశారు

ఆగని మహిళలపై దాడులు

ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి ధావళే

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్ల అయినా నేటికీ మహిళలపై లైంగిక వేధింపులు, దాడులు జరుగుతూనే ఉన్నాయని ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావళే ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌టిఎఫ్ఐ జాతీయ కార్యదర్శి ఎన్.అరుణకుమారి అధ్యక్షతన జరిగిన మహిళా సదస్సులో ఆమె మాట్లాడారు. రాజ్యాంగం ద్వారా వచ్చిన సమాన అవకాశాలు నేటికీ మహిళలకు అందని ద్రాక్షగానే ఉన్నాయన్నారు. అన్ని రంగాల్లోనూ వివక్షను ఎదుర్కొంటున్నారన్నారు. వీటిపై ఐక్యంగా పోరాడానల్నారు. సిఎం చంద్రబాబు కేంద్రానికి మద్దతు ఉపసంహరించుకునేలా ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేయాలన్నారు. కేంద్రం నూతన పెన్షన్ విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. చంద్రబాబు మద్దతు ఉపసంహరించుకొని దీనిపై మాట్లాడాలన్నారు. చంద్రబాబు, నితీష్‌కుమార్ కేంద్రానికి మద్దతు ఇవ్వడం సిగ్గు చేటు అన్నారు. ఎన్నికల కమిషన్ మోడీ, అమిత్ షా ఆడించే ఆట,పాడించే పాటలా పనిచేస్తుందన్నారు. అరుణకుమారి మాట్లాడుతూ విద్యతోనే వివక్షను రూపుమాపొచ్చన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సి.కమలకుమారి, రాష్ట్ర మహిళా కార్యదర్శి విజయగౌరి మాట్లాడుతూ నేటికీ వేతన వ్యత్యాసాలు కొనసాగుతూనే ఉండటం ఆందోళనకరమన్నారు. ప్రముఖ సామాజిక కార్యకర్త వసుంధర మాట్లాడుతూ మధ్య యుగం కాలంలో దేశంలో మహిళలపై వివక్షత ప్రారంభమై, నేటికీ కొనసాగుతూనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు విజయగౌరి, నాగమణి , దేవి తదితరులు పాల్గొన్నారు.

ఎరుపెక్కిన కాకినాడ

నగర వీధుల్లో భారీ ప్రదర్శన

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా సోమవారం కాకినాడ నగరంలో భారీ ప్రదర్శన జరిగింది. పది కిలోమీటర్ల మేర యుటిఎఫ్ జెండాలు పట్టుకుని ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రదర్శన ముందు భాగాన కొమ్ము డ్యాన్సులు, తప్పెటగుళ్ల ప్రదర్శన ఆకట్టుకుంది. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు ఎన్. వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ నేతత్వంలో ఈ ప్రదర్శన జరిగింది. పిడిఎఫ్ ఎంఎల్‌సిలు, పలువురు ప్రముఖులు ప్రదర్శన అగ్రభాగాన నడిచారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని అంగర గాంధీ సెంటర్ లో సోమవారం అంగర ఎస్ఐ డి.రవికుమార్ ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవికుమార్ మాట్లాడుతూ ఎస్‌పి, సిఐ ఆదేశాల మేరకు అంగర ఆటో యూనియన్ డ్రైవర్లతో అవగాహనా సదస్సు నిర్వహించామన్నారు. వాహనాలను నడిపే ఆటో డ్రైవర్లు మద్యం తాగి, సెల్ ఫోన్ తో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు.ప్రతి వాహనాలకు రికార్డులు సక్రమంగా ఉండాలని, ఇన్సూరెన్స్ విధిగా చేయించాలన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. మోటార్ వెహికల్ యాక్ట్ రూల్స్ ప్రకారం విధులు సక్రమంగా పాటించాలని, ఆటో డ్రైవర్స్ యూనిఫారం ధరించాలని తదితర అంశాలపై డ్రైవర్లకు ఎస్ఐ రవికుమార్ సూచించారు.

ఆటో డ్రైవర్లతో మాట్లాతున్న ఎస్ఐ డి.రవికుమార్

సర్ ఆర్థర్ కాటన్ ట్రోఫీ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - ఆత్రేయపురం

గోదావరి సర్ ఆర్థర్ కాటన్ ట్రోఫీ పేరుతో ఈ నెల 11 నుంచి మూడు రోజులు పాటు నిర్వహించే ముగ్గుల పోటీలు, స్విమ్మింగ్, పడవల పోటీలు జరిగే ప్రదేశాలను సోమవారం కొత్తపేట ఆర్‌డిఒ పి.శ్రీకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులు పాటు జరిగే గోదావరి కాటన్ ట్రోఫీ ప్రేక్షకులు వీక్షించేలా ఏర్పాట్లు చేయాలని తహశీల్దార్ టి.రాజేశ్వరరావును ఆదేశించారు. పోటీలలో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే వారికి ఇబ్బంది తలెత్తకుండా మూడు రోజులు పాటు ఉండేలా సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కేరళ తరహాలో చేపట్టే ఈ కార్యక్రమాలను సిబ్బంది అంత సమన్వయంతో పనిచేసే విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బికెఎస్ఎస్.వెంకట్ రామన్, ఎస్ఐ ఎస్.రాము, విఆర్‌ఒలు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

పోటీలు జరిగే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి దేవస్థానం శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్ కు సోమవారం విజయనగరానికి చెందిన చింతపల్లి ఆదిత్య అఖిల దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు వేదఆశీర్వచనం అందజేసి శేషవస్త్రాలతో సత్కరించి స్వామివారి చిత్రపటం అందజేశారు.

దాతకు స్వామి వారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఉద్యోగులు

రహదారికి ఇరువైపులా తుప్పలు తొలగించాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

మామిడికుదురు శివారు కొర్లకుంటలో సంక్రాత్రి మరుసటి రోజు ప్రభల తీర్థాని కి చేరుకునే రహదారికి రెండు వైపులా ఉన్న తుప్పలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. కొర్లకుంట తీర్థం వరకు సుమారు కిలో మీటర మేర సి సి రోడ్డు రెండు వైపులా డొంకలతో మూసుకు పోయింది. ఈ రహదారిలో పాశర్లపూడి, మామిడికుదురు, నగరం, ఈదరాడ గ్రామాల ప్రభలు రాకపోకలతో పాటు సుమారు 10 గ్రామాల నుంచి వేలాదిమంది ప్రజలు తీర్థానికి విచ్చేస్తారు. ప్రధానంగా ఈ రహదారి నుంచి లంక గ్రామాలైన పెదపట్నం, అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెటదపట్నం లంక గ్రామాల వాసులు మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు ఈ రహదారిలో ఇటీవల సిసి రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డు బెర్మ్ లు వద్ద బూడిద వేశారు. బూడిద బెర్మ్ లతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు బెర్మ్‌లను పటిష్టంచేయాలని స్థానికులు కోరుతున్నారు.

డొంకలతో మూసుకుపోయిన ప్రభల తీర్థానికి వెళ్లే రహదారి

పుస్తక పఠనంతో విజ్ఞానం

డిజిటల్ గ్రంథాలయ గది నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని ఎంఎల్‌ఎ అయితాబత్తుల ఆనందరావు అన్నారు. గొల్లవిల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలలో పిఎంశ్రీ నిధులు రూ.23.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న డిజిటల్ గ్రంథాలయ గదికి సోమవారం ఎంఎల్‌ఎ ఆనందరావు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల విద్యతోపాటు గ్రంథాలయాలయం లోని విలువైన పుస్తకాలను చదవడం అలవర్చుకోవాలన్నారు. తద్వారా గొప్ప విజ్ఞానాన్ని పెంపొందించుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని అన్నారు.పాఠశాలకు వచ్చిన ఎంఎల్‌ఎ ఆనందరావును ఎస్ఎంసి ఛైర్మన్ వాలా సత్యనారాయణ, హెచ్ఎం లంక రాణి, ఉపాధ్యాయులు దుశ్శాలువాలు కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచ్ జొన్నాడ శ్రీ దుర్గ, మాజీ జడ్‌పిటిసి, రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, టిడిపి మండల అధ్యక్షులు అరిగెల నానాజీ, గ్రామ కమిటీ అధ్యక్షుడు చీకట్ల ఏసుబాబు, నీటి సంఘం అధ్యక్షుడు నల్లా సత్యనారాయణ, మాజీ సర్పంచ్ గుత్తాల సుభాష్ చంద్ర రావు(బోసు), మాజీ ఎంపిటిసి సభ్యుడు కాగిత సత్యనారాయణ, ఎంఇఒ లు కె.కిరణ్ బాబు,సత్తి సత్య కష్ణ, ఎస్ఎస్ఎ, జెఇ, జివిఎస్ వివిఎస్ నారాయణ, కూటమి నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొల్లవిల్లి జడ్‌పి ఉన్నత పాఠశాల్లో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ ఆనందరావు తదితరులు

కార్టూ'నిజం'



ఏఐతో అభ్యర్థుల నైపుణ్యాల గుర్తింపు
యాప్ సహకారంతో ఉద్యోగాల సమాచారం ఆన్‌లైన్‌లో చేరవేత

వ్యర్థాలు డ్రెయినేజీల్లో వేయొద్దు

సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు

ప్రజాశక్తి - రామచంద్రపురం

గ్రామాల్లో ప్రజలు ఉపయోగించే ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థ పదార్థాలు డ్రెయిన్లలో వేయవద్దని సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు విజ్ఞప్తి చేశారు. మండలంలోని హసన్ బాద గ్రామంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు అధ్యక్షతన సోమవారం గ్రామసభ నిర్వహించారు.ఈ గ్రామ సభలో అనేక గ్రామ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తీర్మానం చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందన్నారు. అందులో భాగంగా డ్రెయిన్ సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. గ్రామంలో రోడ్లు వేసిన విషయాన్ని గ్రామస్తులకు వివరిస్తూ, నియోజక వర్గ అభివృద్ధికి స్థానిక మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవను అభినందించారు. పారిశుధ్యం పట్ల అందరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు వ్యర్థ పదార్థాలు డ్రెయినేజీలలోను పబ్లిక్ ప్రదేశాల్లో వేయకుండా పారిశుధ్య కార్మికులకు సహకరించాలని గ్రామ ప్రజలను కోరారు. సంక్రాతి పండుగను సాంస్కృతిక సాంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహించుకోవాలని అన్నారు. కోడిపందేలు, జూదం, బహిరంగంగా మద్యం తాగడం వంటి వాటి జోలికి పోకుండా అందరూ కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతి పండుగ నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నీలం భవాని, కార్యదర్శి శ్రీనివాస్, విఆర్‌ఒ సత్తిబాబు, సచివాలయ, రెవెన్యూ, పంచాయతీ, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ఆలమూరు

రైతులు తమ భూ సమస్యలపై గ్రామ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కెజె.ప్రకాష్ బాబు అన్నారు. ఆలమూరు పంచాయతీ వద్ద ఆయన ఆధ్వర్యంలో సర్పంచ్ నాతి లావణ్య కుమార్ రాజా అధ్యక్షతన సిబ్బందితో గ్రామ రెవెన్యూ సదస్సును సోమవారం నిర్వహించారు. ఇందులో రైతులు తమ భూ సమస్యలపై 13 ఫిర్యాదులు దరఖాస్తుల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధి 18 గ్రామాల్లో సోమవారంతో రెవెన్యూ సదస్సులు ముగిశాయన్నారు. ఇందులో భూ సమస్యలు ఐదు రకాలుగా ఉన్నాయన్నారు. అవి జాయింట్ ఫీల్డ్ విభజన, పట్టాదారు పేరు నమోదు, జాయింట్ ఫీల్డ్ ముటేషన్, విస్తీర్ణం నందు వ్యత్యాసం, సర్వేనెంబర్ కొర్లేషన్ సవరణగా ఉన్నాయి. వీటి కొరకు ఫిర్యాదుదారులు దరఖాస్తుల రూపంలో అందజేయగా స్వీకరించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అమలాపురం పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి ఈదల సత్తిబాబు, మాజీ జడ్‌పిటిసి సభ్యుడు రామానుజుల శేషగిరిరావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ ఈదల నల్లబాబు, సొసైటీ మాజీ ఛైర్మన్ వంటిపల్లి సతీష్ కుమార్, డిటి సుబ్బరాజు, ఆర్ఐ రామాయమ్మ, మండల సర్వేయర్ ప్రభావతి, కార్యదర్శి మోక్షంజలి, గ్రామ వీఆర్వోలు, సర్వేయర్లు, పాల్గొన్నారు.

ఆలమూరులో అవగాహనా ర్యాలీ

పంట కాలువ ఆధునికీకరణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - కె.గంగవరం

కె.గంగవరం మండంలోని పేకురు పంట కాలువ ఆధునికీకరణ పనులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. కె.గంగవరం మండలంలోని పంట పొలాలకు గత కొన్నేళ్లు గా కాలువలు పూడుకుపోయి సాగునీరు సక్రమంగా అందడం లేదని రైతులు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు విన్నవించారు. దీంతో స్పందించిన మంత్రి సుభాష్ ఎర్ర పోతవరం లాకులు వద్ద నుండి పేకేరు వరకు గల పంట కాలవ ఆధునికీకరణ పనులను ప్రారంభించాలని ఆదేశించారు. ఈ మేరకు ప్రొక్లెయినర్ సహాయంతో పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘాల అధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభించిన నీటి సంఘం అధ్యక్షులు

నేరాలు ఘోరాలు

కోడిపందేల శిబిరంపై దాడులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని ర్యాలి గ్రామం శివారున కోడిపందేలు జరుగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారం రావడంతో సోమవారం ప్రొబేషన్ ఎస్ఐ ఎస్ రాము, సిబ్బంది కలిసి కోడి పందేల శిబిరంపై దాడి చేశారు. ఈ దాడుల్లో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రెండు కోళ్లు, రెండు కత్తులు, రూ.3 వేలు నగదు స్వాధీన పరచుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రొయ్యల చెరువులో పడి కూలీ మృతి

ప్రజాశక్తి - కరప

మండలంలోని సిరిపురం గ్రామంలో చిక్కాల దొరబాబుకు చెందిన రొయ్యల చెరువులో పడి ఒక కూలీ మృతి చెందాడు. ఎస్ఐ టి.సునీత తెలిపిన వివరాల ప్రకారం...జి.భావరం గ్రామానికి చెందిన అయితా ప్రభాకర్ ఆనందబాబు (59) రొయ్యల చెరువుల దగ్గర కూలీగా పని చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం రొయ్యలకు మేత వేస్తుండగా ఫైబర్ బోటు ప్రమాదవశాత్తు తిరగబడి మునిగిపోయింది. దీంతో ఆనందబాబు చెరువులో పడి మునిగిపోయాడు. దీంతో రొయ్యల మేత వేస్తున్న తోటి కూలీలు బోడపాటి దుర్గాప్రసాద్, ఈతా బుల్లిరాజు చెరువులో దిగి ఆనంద బాబును బయటికి తీసే సరికి చనిపోయి ఉన్నాడని, మృతిని పెద్దకొడుకు అయిత సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం-వాలుతిమ్మాపురం రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సామర్లకోట గణపతి నగరానికి చెందిన పెంకె అప్పారావు (60) పట్టాభి ఆగ్రో రైస్ మిల్లులో పని చేస్తున్నాడు. సోమవారం పని ముగించుకుని బైక్‌పై సామర్లకోట వెళ్తుండగా వాలు తిమ్మాపురం వైపు వెళ్తున్న లారీ బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న అప్పారావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ మౌనిక సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని వాలుతిమ్మాపురం క్వారీ ఏరియాలో సోమవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అడపా శ్రీనివాసరావు తెలిపారు. ఈ దాడుల సందర్భంగా ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు చిట్టిబాబు, ఆనందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

ప్రజాశక్తి - పెరవలి

మండలంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఖండవల్లికి చెందిన పెదపూడి శక్తిగణేష్‌కుమార్(25) తన స్నేహితుడు వినయ్‌కుమార్‌తో కలిసి బైకుపై తణుకు నుంచి ఖండవల్లి వైపు వెళ్తున్నారు. వారు రవలి స్పిన్నింగ్ మిల్ సమీపానికి చేరుకునే సరికి ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి రోడ్డు ప్రక్కన ఉన్న సైన్ బోర్డును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో గణేష్ కుమార్ అక్కడిక్కడే మృతి చెందాడు. గాయపడిన వినయ్‌కుమార్‌ను తణుకులో ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

వికలాంగుడు సజీవ దహనం

ప్రజాశక్తి-నల్లజర్ల

ప్రమాదవశాత్తు తాటాకింటికి మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో వికలాంగుడు నామన దానియేలు(24) సజీవ దహనమయ్యారు. ఈ ఘటన నల్లజర్లలోని కోనేరు కాలనీలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మతిమ నూనె ప్యాకెట్లు విక్రయించి దుకాణంలో పని చేస్తూ మంద మూడు చక్రాల ఒకసారి ఇంటికి వస్తూ ఉంటాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇంటికి వచ్చిన డేనియేలు భోజనం అనంతరం నిద్రకు ఉపక్రమించాడు. సమీపంలో చలిమంటలో ఉన్న నిప్పు రవ్వలు లేచి తాటాకు ఇంటికి ఉన్న కొబ్బరి ఆకుల దడికి అంటుకుని ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. క్షణాల్లోనే మంటలు దానియేలు పడుకున్న గుడిసెను చుట్టుముట్టాయి. ఈ ప్రమాదంలో సజీవ దహనమయ్యాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ శోభనాద్రి తెలిపారు.

కూళ్లలో యువకుని హత్య

ప్రజాశక్తి - కె.గంగవరం

మండలంలోని కూళ్ల గ్రామంలో సోమవారం రాత్రి సత్తి శివ అనే యువకుడు హత్యకు గురయ్యాడు. అదే గ్రామానికి చెందిన మంచాల సురేష్ అనే యువకుడు శివను హత్య చేసి కె. గంగవరం పోలీసుకు లొంగిపోయాడు. విషయం తెలుసుకున్న కె. గంగవరం ఎస్ఐ జాని బాషా తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం తెలియజేస్తామని ఎస్ఐ వివరించారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

గోలి శ్యామలను అభినందించిన కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

విశాఖపట్నం నుంచి కాకినాడ వరకు బంగాళాఖాతంలో ఏడు రోజుల పాటు 150 కిలో మీటర్లు ఈది ఘనతను సాధించిన సామర్లకోటకు చెందిన గోలి శ్యామలను కలెక్టర్ షాన్ మోహన్ ఘనంగా సత్కరించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆమె కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వయసుతో నిమిత్తం లేకుండా ఏకాగ్రతతో మొదలుపెట్టి ఈదుకుంటూ విజయవంతంగా కాకినాడ చేరుకోవడం గొప్ప విషయమని అన్నారు. సముద్రాలను ఈదడం హాబీగా పెట్టుకున్న ఆమె ధైర్య సాహసాలు నేటి యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయని కలెక్టర్ కొనియాడారు.

'పిజిఆర్ఎస్'పై విశ్వసనీయత పెంపొందించాలి

కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

అర్జీదారుల వ్యక్తిగత, సామాజిక సమస్యలను సంతృప్తికర స్థాయిలో నాణ్యతతో పరిష్కరిస్తూ పిజిఆర్ఎస్ నిర్వహణ తీరుపై అర్జీదారులలో విశ్వసనీయతను పెంపొందించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి భవన్ నందు జిల్లాస్థాయి మీకోసం కార్యక్రమాన్ని జిల్లాస్థాయి అధికారులతో నిర్వహించారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జెసి టి,నిషాంతి, డిఆర్‌డిఎ, డ్వామా ఐసిడిఎస్ పీడీలు శివశంకర ప్రసాద్, మధుసూదన్, ఝాన్సీరాణీలు అర్జీదారుల నుంచి సుమారుగా 218 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసంగిస్తూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కలను ప్రజలు సద్వినియోగం చేసుకుంటూ తమ యొక్క సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక వెబ్ పోర్టల్ ను కూడా ప్రవేశపెట్టిందని అన్నారు. మున్సిపల్ కార్యాలయాల్లో, మండల పరిషత్ అభివృద్ధి అధికారుల కార్యాలయాల్లో సంబంధిత అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారిస్తూ పరిష్కార మార్గాలు చూపుతారన్నారు. మండల స్థాయిలో పరిష్కారమయ్యే అర్జీలను మండల స్థాయిలోనే సమర్పించాలని ఆయన స్పష్టం చేశారు. దరఖాస్తును ఆన్లైన్లో నమోదు చేసి సంఖ్య కేటాయిస్తారని దాని ఆధారంగా నమోదిత ఫిర్యాదు ఏ దశ, స్థితిలో ఉందో తెలుసుకునే వెసులు బాటు ఉంటుందన్నారు. సార్వత్రిక ఫిర్యాదుల పరిష్కార హెల్ప్‌లైన్ ద్వారా తమ సమస్యను నేరుగా తెలియజేయడానికి వీలు కల్పిస్తుందని అన్నారు. ఫిర్యాదుదారులు 1902 కి కాల్ చేసి తమ ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని అన్నారు. అధికారులు తమ లాగిన్ కు వచ్చిన సమస్యలను పూర్తి స్థాయిలో విచారించి సకాలంలో గడువులోగా పరిష్కార మార్గాలు పూర్తి నాణ్యతతో రీ ఓపెన్‌కు ఆస్కారం లేకుండా నాణ్యతతో చూపాలని గడువు దాటిన అర్జీలకు ఆస్కారం లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అర్జీ పరిష్కారం కానీ పక్షంలో అర్జీదారులకు స్పష్టమైన కారణాలను తెలియజేయాలని అన్నారు. ఏ శాఖకు సంబంధించిన సమస్య ఆ శాఖ యొక్క వెబ్ సైట్ ద్వారా పంపిస్తారని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఒ వెంకటేశ్వర్లు, పిఆర్ ఎస్ఇ, పి.రామకృష్ణారెడ్డి, డిఇఒ షేక్ సలీం బాషా, జిల్లా పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ప్రసాద్ ఎల్‌డి ఎం. కేశవ వర్మ, డిసిహెచ్ఎస్ కార్తీక్ రెడ్డి, డిఎంహెచ్ఒ ఎం.దుర్గారావు దొర, డిఐపిఆర్ఒ కె.లక్ష్మీనారాయణ, వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్ వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

12 నుంచి సంక్రాంతి ఉత్సవ్

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలో ఈనెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకూ సంక్రాంతి ఉత్సవ్ పేరిట సంబరాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. 12 నుంచి ప్రారంభమయ్యే సంక్రాంతి ఉత్సవ్ పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అందించి వాటిని సంరక్షించాలనే సంకల్పంతో జనవరి 12 నుంచి 14 వరకూ రామచంద్రపురం పట్టణంలోని వివిఎస్ఎం కళాశాల ప్రాంగణంలో సంక్రాంతి ఉత్సవ్ 2కె-25 పేరుతో మెగా సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయంలో సంక్రాంతి ఉత్సవ్ గోడ పత్రికను ఆవిష్కరించారు. తెలుగు ప్రజలకు సంక్రాంతి పండుగ చాలా ప్రత్యేకమైనదని, ఆ పండుగ ప్రత్యేకత భావితరాలకు తెలియజేయడంతో పాటు, నియోజకవర్గంలోని ప్రజలంతా ఉత్సాహంగా, ఉల్లాసంగా సంక్రాంతి పండుగ జరుపుకోవాలనే ఉద్దేశంతో కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. సంక్రాంతి ఉత్సవ్ వేడుకలు భోగి మంటలతో ప్రారంభమై మహిళలకు ముగ్గుల పోటీలు, యువతి, యువకుల కొరకు సంగీతా విభావరి, పిల్లల మనసును దోచే ఆటలు, గోదావరి జిల్లాల ఆత్మీయ ఆతిథ్యానికి రకరకాల పిండి వంటలు, పిల్లలకు పతంగులు, వివిధ రకాల సంస్కృతిక కార్యక్రమాలు, జబర్దస్త్ కామెడీ షోలు వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. మహిళలకు ముగ్గుల పోటీ ఏర్పాటు చేసి బహుమతులు అందజేస్తామన్నారు. మూడు రోజుల పండుగ సంబరాలలో అందరూ పాల్గొనాలని, నియోజకవర్గం ప్రజలు ఐక్యతతో, సుఖ సంతోషాలతో జీవించాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేశామని మంత్రి వివరించారు.

సంక్రాంతి ఉత్సవ్ పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి సుభాష్

అభివృద్ధి చూసి ఓర్వలేకే ఆరోపణలు

ఎంఎల్ఎ బండారు సత్యానందరావు

ప్రజాశక్తి - రావులపాలెం

అభివృద్ధిని చూసి ఓర్వలేక మాజీ ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నారని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు మండిపడ్డారు. స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పాల్గొని మాట్లాడుతూ అవినీతి పితామహులు రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, కొత్తపేటలో చిర్ల జగ్గిరెడ్డి అని విమర్శించారు. ప్రజలకు ఇసుకను ఉచితంగా పంపిణీ చేస్తుంటే అవినీతి పితామహుడు జగ్గిరెడ్డి ఇసుకలో అవినీతి జరిగిందనడం సిగ్గుచేటన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో నదులలో ఇసుకను అక్రమంగా తరలించి రూ.కోట్లు గడించడమే కాకుండా అనుమతులకు విరుద్ధంగా నదులలో చెరువులను తలపించేలా ఇసుక తవ్వకాలు చేసి ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోవడానికి కారణమయ్యారని ఆరోపించారు. ప్రజలకు ఉచితంగా ఇసుకను సరఫరా చేయాలని ప్రభుత్వం కొత్త పాలసీ తీసుకు వచ్చిందని అందులో లోటుపాట్లు ఉంటే విమర్శనాత్మకంగా స్పందిస్తే సరిచేసుకుంటామని అదుపుతప్పి మాట్లాడితే మాత్రం సహించేది లేదని హెచ్చరించారు. రాష్ట్రంలో జగన్, కొత్తపేటలో జగ్గిరెడ్డి అవినీతి భరించలేక ప్రజలు రాష్ట్రంలో కూటమి పార్టీలకు, నియోజకవర్గంలో తనకు భారీ మెజారిటీ విజయాన్ని అందించారని సత్యానందరావు తెలిపారు. ఇకనైనా అసత్య ఆరోపణలు,ప్రచారాలు మాని చేసిన తప్పులను సరిదిద్దుకోవాలని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు మాజీ ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్‌డిఎ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ బండారు

'సూర్యఘర్'తో వినియోగదారులు, రైతులకు మేలు

జెసి టి. నిషాంతి

ప్రజాశక్తి - అమలాపురం

ప్రధానమంత్రి సూర్య ఘర్‌యోజన పథకం ద్వారా సాధారణ వినియోగదారులకు, రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని .జెసి టి.నిషాంతి అన్నారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పిఎం సూర్యఘర్ యోజన పథకం ద్వారా గహ వినియోగదారుడే విద్యుదుత్పత్తిదారుడిగా మారే అవకాశం కలుగుతుందన్నాయరు. అధిక ప్రయోజనాలు కలిగిన సూర్య ఘర్ యోజనను సద్వినియోగం చేసుకుని ప్రజలు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకుని తమకు నచ్చిన వెండర్ల ద్వారా సోలార్ గ్రూప్ టాప్ సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇపిడిసిఎల్ పరిధిలో విస్తృత ప్రచారం, నిఎం సూర్య ఘర్ యోజన పై అవగాహన సోలార్ వినియోగం పెంచడమే లక్ష్యమన్నారు. ప్రస్తుతం మనం ఉపయోగిస్తున్న విద్యుత్తు తయారీలో 30 శాతం బొగ్గు ఆధారితంగా తయారవుతుందన్నారు. తద్వారా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించాలని సంకల్పంతో ప్రధాని సూర్య ఘర్ యోజన పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో కూడా వీటిని ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం చెల్లించే విద్యుత్ బిల్లుల ఛార్జీలను బ్యాంకు రుణం నెలవారీ చార్జీలుగా చెల్లించుకోవచ్చునని మూడు కెవి ప్యానెల్ ఏర్పాటు ద్వారా మొత్తం ఖర్చు రూ 2,20,000, రూ.20 వేల లబ్ధిదారుని వాటాగా చెల్లించాలన్నారు. మిగిలిన రూ.రెండు లక్షలు బ్యాంకు రుణంగా అందిస్తుందన్నారు. మీటర్ బిగించిన తరువాత కేంద్రం రూ.78వేలు రాయితీగా అందిస్తుందన్నారు. మిగిలిన రూ.1,22,000 ఐదు సంవత్సరాల కాలంలో బ్యాంకు రుణం పూర్తిగా తీరుతుందని స్పష్టం చేశారు. సోలార్ విద్యుత్ వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రభుత్వ విద్యుత్ సంస్థలు ప్రణాళికలు రూపొందిస్తున్నాయని అన్నారు. ఇప్పటికే ఆయా డిస్కంల పరిధిలో సోలార్ ప్రొడక్ట్స్‌పై అవగాహన పెంచడంతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలను అమలు చేసే దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారన్నారు. ముఖ్యంగా పిఎం సూర్య ఘర్, పథకం వినియోగదారుల దరిచేర్చేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను సైతం నిర్వహిస్తున్నారన్నారు. ఈ పథకాలతో కలిగే బహుళ ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించి సోలార్ విద్యుత్ వైపు వారితో అడుగులు వేయించాలన్నారు. సోలార్ వల్ల విద్యుత్ బిల్లులు తగ్గించుకోవడంతో పాటు మిగిలిన విద్యుత్ గ్రిడ్డుకు విక్రయించి లాభాలు కూడా పొందవచ్చని సూచిస్తున్నారు. ఈ స్కీమ్స్ పొందేందుకు గల నియమాలతో పాటు బ్యాంకు రుణాలు, సబ్సిడీ తదితర పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తూ సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. పిఎం సూర్య ఘర్ ద్వారా సాధారణ వినియోగదారులకు, పథకం ద్వారా రైతులకు మేలు చేకూరుతుందన్నారు. ఈ పథకాలను పొందేందుకు బ్యాంకులు రాయితీలు ప్రకటిస్తుండడంతో వినియోగదారులు సోలార్ వైపు అడుగులు వేయాలన్నారు. పట్టణాలు గ్రామాల్లో సౌర ప్రాజెక్టులు ఏర్పాటుచేసే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు సౌరశక్తి వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు ప్రస్ఫుటంగా వివరించాలన్నారు. వినియోగదారులు ఈ ఉత్పత్తులపై వారికున్న సందేహాలను నివృతికత చేయాలని విద్యుత్ సదుపాయం అంతంత మాత్రమే ఉన్న గ్రామాలను గుర్తించి తొలుత అక్కడ సౌర విద్యుత్ వెలుగులు ప్రసరింపజేసే దిశగా ప్రణాళికలు రూపొందించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్ఇ ఎస్.రాజబాబు, జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న జెసి

విద్యార్థులకు నగదు, క్రీడా దుస్తుల పంపిణీ

ఆర్థిక సాయం అందజేసిన పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - రావులపాలెం

మండలపరిధి పొడగట్లపల్లి బెజవాడ గోపాలరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో పూర్వవిద్యార్థుల బృందం పేద విద్యార్థులకు ఆర్థిక సాయం, పెన్నులు, క్రీడా దుస్తులు అందజేశారు. సోమవారం ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు వంశీ కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎస్ఎంసి ఛైర్మన్ జాలాది సహదేవుడు, పూర్వ విద్యార్థుల బృందం, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు అల్లూరి గోపాలరాజు, రిటైర్డ్ సొసైటీ సెక్రటరీ కోళ్ల గోపాలరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు సమకూర్చిన రూ.35వేలు పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. విద్యార్థులకు పెన్నులు, స్పోర్ట్స్ దుస్తులు, ఉప్పలపాటి జానకియమ్మ అన్నదాన సత్రం ఇఒ మీసాల రాధాకృష్ణ యుటిఎఫ్ రూపొందించిన పదవతరగతి స్టడీ మెటీరియల్‌ను ఛైర్మన్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చంద్రశేఖర్ మాస్టారు ప్రోత్సాహం తో పూర్వ విద్యార్థులందరం బృందంగా ఏర్పడి ప్రతీ ఏడాది విద్యార్థులకు తగిన తోడ్పాటు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణ కలిగి విద్యాభ్యాసం చేసి ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి పేరుప్రఖ్యాతులు తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు సమకూర్చి సాయం అందిస్తున్న ఛైర్మన్

క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

డ్వామా ఉద్యోగుల రాష్ట్ర సంఘం నూతన క్యాలెండర్ , డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లా నీటి యాజమాన్య సంస్థకు చెందిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఉద్యోగులు రాష్ట్ర సంఘం రూపొందించిన 2025 నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీని సోమవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఎస్.మధుసూదన్, ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగ సంక్షేమ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు వి.రాజమణి, సాధారణ కార్యదర్శి ఎన్.శ్రీనివాస రావు, కోశాధికారి జి.రవీంద్ర బాబు, రాష్ట్ర సాధారణ కార్యదర్శి ఎం.త్రినాథ్, ఎపిఒ వి.శ్రీనుబాబు, సునీత, పల్లయ్య శ్రీనివాసు పాల్గొన్నారు.

ముక్తేశ్వరం లో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ముక్తేశ్వరంలో భీమా కోరేగావ్ విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - అయినవిల్లి

భీమా కోరేగావ్ యుద్ధానికి 2005 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ముక్తేశ్వరంలో అంబేద్కర్ ఇండియా మిషన్ ఆధ్వర్యంలో దళిత సంఘాల నాయకులు సోమవారం భీమా కోరేగావ్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు అయినవిల్లి మండల పరిషత్ కార్యాలయం నుండి ముక్తేశ్వరం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఇండియా మిషన్ జిల్లా కన్వీనర్ జల్లి రాజ్ కుమార్, ఇండియా మిషన్ రాష్ట్ర నాయకులు జల్లి రాజశేఖర్, జిల్లా అధ్యక్షులు జల్లి నరేష్, మాలమహానాడు నాయకులు గిడ్ల వెంకటేశ్వరరావు, ఎడ్ల సత్య, మద్దల చంటిబాబు, నామాడి టైటస్, కొంకి వెంకట్రావు, సరేళ్ళ సత్యనారాయణ, కుసుమ బహుగుణ మండలాలకు చెందిన పలువురు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు .

నేటి నుంచి మండల స్థాయి క్రీడోత్సవాలు

ప్రజాశక్తి -మామిడికుదురు

కలెక్టర్ ఆదేశాల ప్రకారం 'ఆటలతో ఆరోగ్యం' పేరిట మామిడికుదురు హైస్కూల్ ప్రాంగణంలో మంగళవారం మూడు రోజులపాటు మండల సాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కె. వెంకటేశ్వరరావు తెలిపారు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం 'ఆటలతో ఆరోగ్యం' పేరిట క్రీడోత్సవాల నిర్వహణకై హెచ్ఎంలు, సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులతో కో- ఆర్డినేషన్ సమావేశం నిర్వహించామన్నారు సమావేశంలో ఎఇఒలు లక్ష్మీనారాయణ, ఎం.వెంకన్నబాబులు పాల్గొన్నారు.

సంక్రాంతికి 52 ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - సామర్లకోట

సంక్రాంతి పండుగ రద్దీ కారణంగా సౌత్ సెంట్రల్ రైల్వే 52 అదనపు రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. సికింద్రాబాద్, కాచిగూడ, చర్లపల్లి రైల్వేస్టేషన్ల నుంచి కాకినాడ, నర్సాపూర్, తిరుపతి, శ్రీకాకుళం ప్రాంతాలకు ఈ రైళ్లు నడపనున్నట్లు తెలిపింది. ఆయా ప్రాంతాలకు ఈ నెల 6 నుంచి 18వ తేదీ వరకు ఇవి అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. వికారాబాద్-కాకినాడ టౌన్(07037) రైలు ఈనెల 13వ తేదీన, కాకినాడ టౌన్-చర్లపల్లి (07038) 14వ తేదీన, సికింద్రాబాద్ - కాకినాడ 07078) రైలు ఈనెల 12, 19 తేదీల్లో, చర్లపల్లి - కాకినాడ (07031) రైలు 8, 10, 14, 16, 18 తేదీల్లో, కాకినాడ -చర్లపల్లి (07032) రైలు 9, 11, 13, 15 తేదీల్లో, నాందేడ్-కాకినాడ (07487) రైలు 6,13 తేదీల్లో, కాకినాడ- నాందేడ్ (07488) రైలు 7, 14 తేదీల్లో అందుబాటులో ఉంటున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైళ్లకు సంభందించి టికెట్ బుకింగ్ సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం అయినట్లు అధికారులు తెలిపారు.

మండపేట పట్టణ సిఐగా సురేష్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - మండపేట

పట్టణ సి ఐ గా దారంసురేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల ల్లో ఇక్కడ సిఐగా అఖిల్ జమ విధులు నిర్వహించారు. ఎన్నికల అనంతరం ఆయన విఆర్‌లో వెళ్లారు. అప్పటి నుంచి ఇక్కడ సిఐని నియమించలేదు. రూరల్ సిఐ పీతల దొర రాజు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు నిర్వహించారు. సోమవారం సిఐ సురేష్ మండపేట పట్టణ బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో విజయవాడలో విధులు నిర్వహించారు. ఎన్నికల సమయంలో సామర్లకోటలో పనిచేశారు. ఈ సందర్భంగా సిఐ సురేష్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, ట్రాఫిక్‌పై దృష్టి పెడతామని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ మార్పు చేయనున్న దృష్ట్యా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఇఇ ఉదయభాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాళ్లరేవు, సీతారామపురం, పి.మల్లవరం, పోలేకుర్రు, కోరంగి, గాడిమొగ, భైరవపాలెం, చినవలసల, పెదవలసల, జార్జిపేట, నీలపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించాలని కోరారు.

గుండె సంరక్షణకు జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - కాకినాడ

గుండె రక్షణ కోసం ముందస్తు జాగ్రత్తలు అవసరమని ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ మాతా శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక మెడికవర్ హాస్పిటల్స్‌లో గుండె సంరక్షణపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలికాలంలో గుండె సంబంధిత సమస్యలు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. వాతావరణం చల్లగా ఉండడం వల్ల రక్తనాళాలు సంకోచిస్తాయన్నారు. దీనివల్ల రక్తప్రవాహం తగ్గిపోవడం, రక్తపోటు పెరగడం వంటి సమస్యలు ఏర్పడుతాయన్నారు. ప్రముఖ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రణవ్ పల్లెంపాటి మాట్లాడుతూ చలి కారణంగా శరీర ఉష్ణోగ్రత తగ్గిపోవడం, రక్తనాళాలపై ఒత్తిడి పెరగడం వల్ల గుండె మీద పని భారం ఎక్కువవుతుందన్నారు. ఈ కార్యక్రమములో సెంటర్ హెడ్ శుభాకరరావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమ్‌రామ్ పాల్గొన్నారు.

నారాయణ కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - అల్లవరం

దేవగుప్తం గ్రామానికి చెందిన పినమాల నారాయణ అనారోగ్యంతో రాజమహేంద్రవరం స్వతంత్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబీకుడైన నారాయణను నల్లగుంట-చింతలమెరక గ్రామ ప్రజలు నారాయణ కుటుంబానికి అండగా నిలిచారు. సోమవారం గ్రామస్తులు రాజమహేంద్రవరంలోని నారాయణ కుటుంబానికి ఆసుపత్రి వద్ద రూ.61వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న దేవగుప్తం గ్రామస్తులు

PUBLICATION

IN THE COURT OF THE HON'BLE II ADDL DIST COURT : Dr. B. R. AMBEDKAR KONASEEMA DIST: AMALAPURAM

ARBEP No.773 of 2022 In AC No: 1067 of 2021

Between:

Shriram Tranceport Finance Co., Ltd, Amalapuram Branch, rep by its GPA holder B.Srinivas Reddy ...D.Hr.

Vs

Kanithi Durga Vara Prasad & ఇ ...

2nd JDr: Chappidi Naga Manikanta, S/o. Ramana Yesu, D.No.2-4-8, Amalapuram.

The above named D Hr company has instituted the above ARBEP against you, and the same stands posted to 14-02-2025 at 10.30 A.M. for your appearance, you are hereby required to appear personally or through advocate attend before this Hon'ble court at 10.30 AM and file your objections if any, failing which the matter will be heard and determined in your absence exparte as per Law.

//by the orders of the Hon'ble court//

V.K.S.Bhaskara Sastri, Advocate, Amalapuram
Amalapuram Dt.20-12-2024 Cell: 98483 44577

KANAKADURGA FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్: 2-1-81, ఫస్ట్‌ఫ్లోర్, హనుమాన్ కాంప్లెక్స్, కెఎన్‌ఎఫ్ మెయిన్‌రోడ్డు, ఖజానా జ్యూయలరీ ప్రక్కన, అమలాపురం.
- ఫస్ట్‌ఫ్లోర్, పద్మజ థియేటర్ రోడ్డు, మల్కిపురం
- ఫస్ట్‌ఫ్లోర్, ద్వారకా కాంప్లెక్స్, బస్టాప్ ఎదురు, విక్టరీ గార్డెన్ ప్రక్కన, రావులపాలెం. - D.no:6-7-21/8, first floor, Sai Complex, Opp.Viveka Junior College, Balaji Road,Tuni

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 26-01-2025 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 808.65 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు #238-4-11, Subbammadevi High School Road, Opp.Zed Labs, R.R.Peta, Eluru. నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించుకోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వేంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీస్
KANAKADURGA FINANCE LIMITED
#238-4-11,Subbammadevi High School Road, , Opp.Zed Labs,R.R.Peta, Eluru-534 002.
Contact person, area manager, p.hemanth kumar 8074656196

పాస్‌పోర్టు పోయినది

నా పేరు బూర కుమారి, భర్త: బాబులు అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు అథారిటీ వారిచే 2022లో జారీ చేయబడిన పాస్‌పోర్టు నెం. **W2912473** నా గృహం అనగా ఏలేశ్వరం మండలం, పెద్దనాపల్లి గ్రామం నుండి మోటార్ సైకిల్‌పై జిరాక్స్ నిమిత్తం ఏలేశ్వరం వెళుతుండగా ది. 12-12-2024వ తేదీన పాస్‌పోర్టు ఎక్కడో పోయినది. చుట్టుప్రక్కల ఎంత వెతికినా దొరకలేదు. దొరికినవారు ఈక్రింది చిరునామాలో తెలియజేయగలరు.

బూర కుమారి
భర్త: బాబులు, డోర్ నెం. 4-90,
పెద్దనాపల్లి గ్రామం, ఏలేశ్వరం మండలం
కాకినాడ జిల్లా, సెల్: 99591 06309

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు రాజమండ్రి
EP No.19/2018 in OS No. 132/2004

Between :
ముద్దే నాగేశ్వరరావు - DHR
మరియు
అల్లాడ శ్రీరామమూర్తి (లేటు) మరియు ఇతరులు - JDR's

నోటీసు

To
JDR4) Allada Leela Prasad, S/o. Late Srirama Murthy, Hindu, Aged 50 years, Advocate, D.No.57-3-8, Mallikarjuna Nagar, Near Ambedkar Statue, Annayyachari Street, Rajahmundry
JDR5) Kondupalli Varalakshmi, W/o. Mallikarjuna Rao, Hindu, Aged 57years, House wife, D.No.28-11-26, Devichowk, Rajahmundry

పై నెంబరు గల పిటీషన్‌లో శ్రీ కోర్టువారు మీకు Rule 54 నోటీసు వేసియున్నారు. కాని మీరు నోటీసు తీసుకొనక కాలయాపన చేస్తున్నందున శ్రీ కోర్టువారు ఈ పేపరు ప్రకటన ద్వారా మీరు Rule 54 నోటీసు ఆర్డరు వేసియున్నారు. సదరు పిటీషన్ వాయిదా ది.20-01-2025వ తేదీకి వాయిదా అయియున్నది. కావున మీరు ఈ వాయిదా తేదీ ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గానీ హాజరై తమ ఆక్షేపణలను తెలుపుకోవలెను. లేని యెడల సదరు పిటీషన్‌ను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఆర్డరు మేరకు)

BARLA SRIKANTH
Advocate
D.No.77-9-33/8, Katari Gardens, Rajamahendravaram-533103.